




నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
ఎన్టీఆర్ కృష్ణా
గురువారం 16 అక్టోబర్ 2025


# ఈ కేవైసీ 100% పూర్తి చేయాలి



- ఉపాధి శ్రామికుల ఈకేవైసీ పురోగతి సరిగా లేని మండలాలపై డీఎల్‌డీవోలు దృష్టి సారించాలి
- జిల్లాలోని గ్రామ పంచాయతీల భవనాలన్నింటికీ సౌర విద్యుత్ ఏర్పాటు చేయాలి
- గ్రామాల్లో చెత్త సేకరణ విధానం మెరుగవ్వాలి
- వసతి గృహాలను ప్రత్యేక అధికారులు నిరంతరం తనిఖీ చేయాలి
- ఉపాధి హామీ పథకం, ఐవిఆర్ఎస్ నివేదిక, సంక్షేమ వసతి గృహాలపై సమీక్షలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ

**విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ :** ఈవారం చివరిలోగా ఉపాధి కూలీలందరికీ ఈకేవైసీ పూర్తిచేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. ఎంజిఎన్ఆర్ఇజిఎస్, ఐవిఆర్ఎస్ నివేదిక, వసతి గృహాలపై డి ఎల్ డి వో లు, ఎంపీడీవోలు, వసతి గృహాల ప్రత్యేక అధికారులతో బుధవారం దృశ్య మాధ్యమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ... నవంబర్ నుంచి ఉపాధి హామీ పనులకు బయోమెట్రిక్ విధానం తప్పనిసరి అని, అందువల్ల ఉపాధి శ్రామికులందరికీ ఈకేవైసీ పూర్తిచేయాలని చెప్పారు. 100% ఈ కేవైసీ జరగకుంటే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. టెండర్లతో సంబంధం లేకుండా పశువుల షెడ్లను స్వయంగా నిర్మించుకోవచ్చని, అయితే బిల్లు విలువ 50వేలకు మించరాదని చెప్పారు. స్వయంగా నిర్మించుకోలేని వారికి టెండర్ల

మిగతా 2లో...



గూగుల్ డేటా సెంటర్‌తో

## 1.5 లక్షల ఉద్యోగాలు

- దేశంలోనే తొలిసారి అతిపెద్ద పెట్టుబడి విశాఖపట్నం వచ్చింది
- ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే వెంకట్రావ్

2లో..

# అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

**నిమ్మకూరులో అభివృద్ధి పనులపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష**



**పామర్రు మేజర్ న్యూస్ :** పామర్రు మండల పరిధిలోని నిమ్మకూరు గ్రామంలో వివిధ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం పామర్రు నియోజకవర్గం పామర్రు మండలంలోని రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ నందమూరి తారక రామారావు జన్మస్థలమైన నిమ్మకూరు గ్రామాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించి గ్రామ సచివాలయ ప్రాంగణంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి పలు అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గ్రామంలోని శ్రీ బుజ్జీశ్వర స్వామి శివాలయం జీర్ణోదరణకు మంజూరైన 1.10 కోట్ల రూపాయల పనులకు సంబంధించి వివరాలు దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ సాంబశివరావును అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సామాజిక ఆరోగ్య కేంద్రంగా ఉన్నతి కల్పిస్తూ గతంలో 5.69 కోట్ల రూపాయల వ్యయంతో మంజూరైన 30 పడకల ఆసుపత్రి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. మండలానికి ఒక సిహెచ్ సి ఉండాలని రెండవ సి హెచ్ సి గ్రామంలో మంజూరు కావడంతో సరైన విధివిధానాలు అందాల్సి ఉందని డిఎంహెచ్వో వెంకటరావు కలెక్టర్ కు వివరించారు. ఉంగ్రపూడి శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం వద్ద నుండి నిమ్మకూరు బస్సు స్టాప్ వరకు 7 కిలోమీటర్ల ఆర్ అండ్ బి రహదారి నిర్మాణానికి సంబంధించి మంజూరైన 3.10 కోట్ల రూపాయల బిటి రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా టెండర్ల ప్రక్రియ మొదలు పెట్టాలన్నారు. గ్రామంలో పంచాయతీరాజ్ శాఖ పరిధిలో బి.టి. రహదారుల నిర్మాణానికి 62 లక్షల రూపాయలు, భవనాల నిర్మాణానికి

మిగతా 2లో



సీఎం చంద్రబాబు నాయకత్వంలో

## అభివృద్ధిని అడ్డుకోవటం అసాధ్యం

- గుగూల్ సంస్థ రాష్ట్రంలో నెలకొల్పటం ప్రపంచంలోని తెలుగువారందరూ గర్వించదగ్గ విషయం
- టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా వెల్లడి

వివరాలు 7లో...

(మొదటిపేజీ తరువాయి)



## ఈ కేవైసీ 100% పూర్తి చేయాలి



ద్వారా వెండర్‌ను ఎంపిక చేయాలని చెప్పారు. గ్రామపంచాయతీలో చెత్త సే కరణపై ప్రజల నుంచి పూర్తిస్థాయి సంతృప్తి వ్యక్తం కావడం లేదని, దీనికి గల కారణాలను అన్వేషించాలని చెప్పారు. జిల్లాలో ముక్తేశ్వరపురం, సుబ్బయ్య గూడెం, పాతపాడు, రాయనపాడు, పొందుగల గ్రామపంచాయతీలు చెత్త సేకరణలో టాప్ ఫైవ్‌లో ఉన్నాయని అభినందించారు. మిగిలిన గ్రామా లలో కూడా చెత్త సేకరణ సక్రమంగా జరగాలని ఆదేశించారు. జిల్లాలోని గ్రామపంచాయతీల భవనాలన్నింటికీ సౌర విద్యుత్ ఏర్పాటు చేయాలని చె ప్పారు. సంక్షేమ వసతి గృహాలను నిరంతరం పర్యవేక్షించాలని ప్రత్యేక అధి కారులను ఆదేశించారు. ఆహార నాణ్యత, మంచినీటి సదుపాయం, పారిశుధ్య నిర్వహణ, విద్యార్థుల హాజరు తదితర అంశాలను పరిశీలించాలని, దీని కై ప్రత్యేక అధికారులు ఆకస్మిక తనిఖీలు చేయాలని చెప్పారు. నీటి నాణ్యత నిర్ధారించడానికి ప్రతి సంక్షేమ వసతి గృహానికి క్లోరిన్ కిట్లను ఇస్తామని తెలిపారు. క్లోరిన్ విలువ 0.5నుంచి 2 పిపియం మధ్యన ఉండాలని, 0.5 కంటే తక్కువ ఉన్న నీటిని త్రాగడానికి వినియోగించరాదని చెప్పారు. హాస్టల్ వార్డెన్లు నీటి పరీక్షలు క్రమం తప్పకుండా నిర్వహించి ఆ వివరాలను రిజిస్ట ర్లో నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ ఏ.రాము, డిపి ఓ లావణ్య కుమారి, డి ఎల్ డి వో లు పి.శ్రీనివాసరావు, పార్థసారథి, బి. ఎన్.లక్ష్మీకుమారి, డివిజనల్ పంచాయితీ అధికారి జి.రాఘవన్ పాల్గొన్నారు.

## కాంట్రాక్టు/ఔట్సోర్సింగ్ పద్ధతిపై పనిచేయుటకు మహిళలు దరఖాస్తు చేసుకోండి

**విజయవాడ, మేజర్ న్యూస్ :** ఎన్టీఆర్, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యములో నడపబడుచున్న ఐసిపిఎస్, ఎస్ఎఎ, పిల్లల గృహాలు, విజయవాడలో కాంట్రాక్టు/ఔట్సోర్సింగ్ పద్ధతిపై పనిచేయుటకు స్థానిక అర్హులైన 18 నుండి 42 సంవత్సరముల వయస్సు కలిగిన మహిళా అభ్యర్థుల నుండి క్రింది పోస్టులకు దరఖాస్తులు కోరియున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈ డబ్ల్యూఎస్ మహిళలకు5 ( సం.ల వయస్సు సడలింపు, దివ్యాంగు లకు 10 సం.ల వయస్సు సడలింపు కలదు. పోస్ట్ వివరాలు: అకౌంటెంట్-1, అసిస్టెంట్ కం డేటా ఎంట్రీ ఆపరేటర్-1, పార్ట్ టైం డాక్టర్-1, చౌకీదారు కం నైట్ వాచ్ విమెన్1, ఆయా-6,ఎడ్యుకేటర్ పార్ట్ టైం -1,ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ మ్యూజిక్ టీచర్ పార్ట్ టైం -2,పీటీ ఇన్స్ట్రక్చర్ కం యోగ టీచర్ పార్ట్ టైం-2,కుక్-1, హెల్పర్-1, హౌస్ కీపర్-2, హెల్పర్ కం నైట్ వాచ్ విమెన్-1 పైన ప్రకటించిన పోస్టులకు దరఖాస్తులు స్వీకరించుటకు గడువు 13.10. 2025 నుండి 22.10.2025 సా.5ల వరకు, ఆసక్తిగల స్థానిక మహిళా అభ్యర్థులు ntr.ap.gov.in నుండి దరఖాస్తులు డౌన్లోడు చేసుకొని పూర్తిచేసిన అన్ని ధ్రువపత్రాల నకళ్ళు గజిటెడ్ అధికారిచే అటెస్ట్ చేయించి దరఖాస్తులు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత అధికారిణి వారి కార్యాల యం, డోర్ నెంబర్ 6-93, కార్మెల్ చర్చి ఎదురురోడ్, కానూరు, విజయ వాడ వారి కార్యాలయంనకు అభ్యర్థులు స్వయంగా సమర్పించవలెనని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత అధికారిణి షేక్ రుక్సానా సుల్తాన బేగం ఒక ప్రకటనలో తెలిపారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపిన 27 మంది వ్యక్తులకు జరిమానా

**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** నగరంలో రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ఎన్.టి.ఆర్ జిల్లా పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు వారి ఆదేశాల మేరకు నగరంలో వివిధ ప్రదేశాలలో మద్యం సేవించి వాహనాలు నడిపే చోదకులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ నేపథ్యంలో బుధవారం 2వ, 4వ ట్రాఫిక్ పోలీసు వారు మొత్తం 27 కేసులలో మద్యం సేవించి వాహనములు నడిపే చోదకులను ఆరవ ఆడిషనల్ జ్యూడిషల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్ట్ లో ప్రవేశపెట్టగా, గౌరవ న్యాయమూర్తి లెనిన్ బాబు గారు మొత్తం 27 మందిలో 09 మందికి ఒకొక్కరికి రూ.15,000ల చొప్పున రూ. 1,35,000ల, మిగిలిన 18 మందికి ఒక్కొక్కరికి రూ.10,000ల చొప్పున రూ.1,80,000ల మొత్తం 27 మందికి రూ.3,15,000ల జరిమానా విధించారు. ప్రతి రోజు ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహించి పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుంది. కాబట్టి వాహన చోదకులు ట్రాఫిక్ నియమ నిబంధనలు, మోటార్ వాహన చట్టాలను పాటిస్తూ సురక్షితంగా ప్రయాణం చేయాలని పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు తెలియజేశారు.

# అభివృద్ధి పనులను వేగవంతం చేయండి





(మొదటిపేజీ తరువాయి)

65 లక్షల రూపాయలు, చెరువులకు కంచె నిర్మాణం కోసం 12 లక్షల రూపాయలు, రివిట్మెంటుల నిర్మాణం కోసం 20 లక్షల రూపాయల వ్యయంతో ప్రతిపాదనలు పంపించామని, ఇంకనూ మంజూరు ఉత్తర్వులు రావాల్సి ఉందని పంచాయతీరాజ్ ఇంజనీర్లు జిల్లా కలెక్టర్ కు వివరించారు. గ్రామంలో కల్వర్టు మంజూరు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే గ్రామంలో ప్రజల సౌకర్యార్థం 10 లక్షల రూపాయల వ్యయంతో సామాజిక గోకులం నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ గ్రామంలోని నందమూరి లక్ష్మయ్య వెంకటరావమ్మ సంస్మరణ గురుకుల వృత్తి విద్యా పాఠశాల, కళాశాలలలోని బాలుర, బాలికల డార్మిటరీలను పరిశీలించారు. బాలికల డార్మెటరీలో దెబ్బతిన్న టాయిలెట్ బ్లాక్ పడగొట్టి నూతనంగా నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. పక్కనున్న బ్లాకుకు మరమ్మతులు చేపట్టి బాగు చేయించాలన్నారు. విద్యాసంస్థలలో ఒకసారి పూర్తిగా పారిశుధ్యం చేపట్టాలని ఇదివరకే ఆదేశించామని, దాన్ని సజావుగా పర్యవేక్షించాలని ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి షాహిద్ బాబు, డిటిడబ్ల్యుఓ ఫణి ధూర్జటిని సెల్ ఫోన్ లో ఆదేశించారు. అనంతరం బాలుర డార్మెటరీ సందర్శించి అక్కడ సీలింగ్ లో ఇనుప కడ్డీలు బయటపడి దెబ్బతిని ఉండటం పరిశీలించి తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. కొత్త భవనం నిర్మాణానికి కూడా అంచనాలు రూపొందించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. భవనాల స్థితిగతులను ఏపీ ఆర్ ఐ ఈఎస్ సొసైటీ రాష్ట్ర కార్యదర్శి మస్తానయ్యకు జిల్లా కలెక్టర్ వివరించి నిధులు మంజూరు చేయాలని ఫోన్‌లో కోరారు. తదనంతరం గ్రామం నుండి తిరిగి వెళుతూ వంతెన మధ్యలో ఒకటిన్నర అడుగు అంతరాన్ని పరిశీలించి తగిన మరమ్మతులు చేపట్టాలని పంచాయతీరాజ్ ఇంజనీర్లకు సూచించారు.

ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట గ్రామ సర్పంచ్ దుర్గా శ్రీనివాస్, దేవాదాయ శాఖ ఏసి సాంబశి వరావు, డిఎంహెచ్వో డాక్టర్ ఎ.వెంకట్రావు, పంచాయతీరాజ్ ఆర్ అండ్ బి ఈఈ లు సుధాకర్ గౌడ్, లోకేశ్వరరావు, విద్యుత్ శాఖ ఈఈ గోవిందరావు, డిఇఇలు సురేష్ బాబు, సుందరరావు, ఉప విద్య అధికారిణి ఐ.పద్మారాణి, ఏపీఆర్జేసీ కళాశాల, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీకుమారి, బ్రాహ్మణేశ్వరి, ఏపీ ఆర్ఐఎస్ సొసైటీ డిప్యూటీ కార్యదర్శి సురేష్ బాబు, వైద్యాధికారి డాక్టర్ విజయ్ కుమార్, తూర్పు కృష్ణా డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్, పంచాయతీ కార్యదర్శి అమర్నాథ్, స్థానిక నాయకులు కుదరవల్లి ప్రవీణ్, మురళి, తదితర అధికారులు,అనధికారులు, పలువురు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.





# గూగుల్ డేటా సెంటర్‌తో 1.5 లక్షల ఉద్యోగాలు

### దేశంలోనే తొలిసారి అతిపెద్ద పెట్టుబడి విశాఖపట్నం వచ్చింది

### ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే వెంకట్రావ్



**గన్నవరం, అక్టోబర్ 15, మేజర్ న్యూస్ :** విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు చేయడం వల్ల 1.50 నుండి 1.80లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే వెంకట్రావ్ స్పష్టం చేశారు. బుధవారం ఉదయం తాడేపల్లిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేశంలోనే తొలిసారి అతిపెద్ద పెట్టుబడి విశాఖపట్నం వచ్చిందని, ఇక్కడ 15 మిలియన్ డాలర్ల ఖర్చుతో గూగుల్ డాటా కేంద్రం ఏర్పాటు చేస్తుందని, ఈ కేంద్రం ఏర్పాటుతో రాష్ట్రానికి పెద్దసంఖ్యలో ఐటీ పరిశ్రమలు రానున్నాయన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. హైదరాబాదులో 4.4 బిలియన్ డాలర్లతో అమెజాన్ వెబ్ సర్వీస్ ఏర్పాటుచేయగా 48 వేల మందికి ఉద్యోగాలు లభించాయని, మహారాష్ట్రలో 8.3 బిలియన్ డాలర్లతో ఏర్పాటు చేసిన డేటా సెంటర్లో 81,300 మందికి ఉద్యోగాలు లభించాయని, ఈ లెక్కన చూస్తే 15.5 బిలియన్లతో విశాఖలో ఏర్పాటు చేయనున్న డేటా కేంద్రంలో 1.8 లక్షల మందికి ఉద్యోగాలు లభిస్తాయని వివరించారు. ఇక్కడ డేటా కేంద్రం ఏర్పాటు చేయడంతో ఉత్తరాంధ్ర అభివృద్ధి పరంగా పరుగులు పెడుతుందని యార్లగడ్డ పేర్కొన్నారు. విశాఖలో డేటా కేంద్రం ఏర్పాటు చేయటం వైసీపీ నాయకులకు మింగుడు పడటం లేదని రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవటమే ధ్యేయంగా వారి ప్రవర్తన ఉందని మండిపడ్డారు. గూగుల్ డేటా సెంటర్ అంటే అది కోళ్ల ఫారం షెడ్డు అనుకుంటున్నారేమో అని ఎద్దేవా చేశారు. అధికారంలో ఉన్నప్పుడు గంట, అరగంట, గుడ్డు మంత్రులతో చంద్రబాబును లోకేష్‌ను తిట్టించడమే ధ్యేయంగా పనిచేశారని ఇప్పుడు మళ్ళీ అదే మాజీ మంత్రులతో ఆరోపణలు, విమర్శలు చేయించడం సిగ్గుచేటు అన్నారు. రాష్ట్రంలో యువతకు ఉద్యోగ అవకాశాలు వస్తున్నాయని వైసీపీ నాయకులకు కడుపు మంటగా ఉందని విమర్శించారు. మాజీ ఎంపీ వివరాలను గూగుల్ టేక్ అవుట్ ద్వారా సిబిఐ బయటకు తీయడంతో వైసీపీ నాయకులకు గూగుల్ పట్ల విరక్తి భావంతో మాట్లాడుతున్నారన్న అనుమానాన్ని వ్యక్తం చేశారు. హైదరాబాదులో మైక్రోసాఫ్ట్ ఏర్పాటుకు చంద్రబాబు ఎంతగానో కృషి చేశారని, అదే మైక్రోసాఫ్ట్ వెండర్ షిప్ తీసుకుని ఉంటే వ్యక్తిగతంగా చంద్రబాబు నాయుడుకు వేల కోట్ల ఆదాయం సమకూరేదన్నారు. ఆయన రాష్ట్ర భవిష్యత్తు, యువత ఉద్యోగాల కోసం హైదరాబాదులో మైక్రోసాఫ్ట్ ఆఫీస్ ఏర్పాటు చేయిస్తే నేడు దాదాపు పది లక్షల మందికి ఐటీ రంగంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభించేందుకు ఆ సంస్థ దోహద పడిందన్నారు. గూగుల్ టాటా సెంటర్ సెంటర్ ఏర్పాటుపై జగన్మోహన్ రెడ్డి తన వైఖరిని రాష్ట్ర ప్రజలకు చెప్పాలని ఈ సందర్భంగా యార్లగడ్డ డిమాండ్ చేశారు. మీరు గుడ్లు, బొబ్బట్లు పరిశ్రమలు తెస్తే మేము ప్రతిష్టాత్మకమైన గూగుల్ డేటా సెంటర్ తెచ్చామని ఛలోక్తులు విసిరారు. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు వల్ల కలిగే ప్రయోజలపై గుడ్డు, గంట, అరగంట నాయకులు కాకుండా వైసీపీలోని ఐటి నిపుణులతో బహిరంగ చర్చకు తాను సిద్దమని యార్లగడ్డ సవాల్ విసిరారు.

# అరకు ఇన్‌స్టంట్ కాఫీని విడుదల చేసిన ఆర్గానిక్ ఇండియా




**గుంటూరు, మేజర్ న్యూస్ :** టాటా ఉత్పత్తి అయిన ఆర్గానిక్ ఇండియా, ఇటీవల అరకు ఇన్‌స్టంట్ కాఫీని విడుదల చేసింది, ప్రీమియం 100% అరబికా కాఫీతో తయారు చేయబడిన సర్టిఫైడ్ ఆర్గానిక్ కాఫీ మిశ్రమం ఇది. అత్యంతసహజమైన అరకు వ్యాలీ భూముల నుండి తీసుకోబడిన ఈ ఉత్పత్తి నైతికంగా సాగు చేసిన సేంద్రీ య పదార్థాల వేడుక. పర్యావరణం, స్థానిక సమాజాలసాధికారత పట్ల బ్రాండ్ యొక్క అచంచలమైన నిబద్ధ తకు ఈ ఆవిష్కరణ ఒక నిదర్శనం. నిబద్ధతతోరూపొందించబడిన ఈ ఇన్‌స్టంట్ కాఫీ కేవలం పానీయం కంటే ఎక్కువ - ఇది ప్రతి కప్పులో కలిపిన స్వచ్ఛత, స్థిరత్వం, సంస్కృతి యొక్కమిశ్రమం. ఆర్గానిక్ ఇండియా అరకు కాఫీ 100% ప్రీమియం అరబికా బీన్స్‌తో తయారు చేయబడింది, ఇది రుచికరమైన ఫ్రూటీ, చాక్లెట్ నోట్‌తో గొప్ప, మృదువైన సువాసనను అందిస్తుంది. అరకు లోయలో ఎత్తైన ప్రాంతాలు అంటే సుమారు 3000 అడుగుల ఎత్తులో పెరిగిన ఈ ఉత్పత్తి దాని విభిన్న మూలం నుండి దాని ప్రత్యేక గుర్తింపును పొందింది.

ఈ ప్రాంతం యొక్క సారవంతమైన నేల, చల్లని వాతా వరణం, సేంద్రీయ వ్యవసాయ పద్ధతులు ప్రకృతి, కాఫీరెండింటినీ ఆరాధించే వారికి దీనిని ఒక ప్రత్యేకమైన ఎంపికగా చేస్తాయి. అరకు లోయనుండి కాఫీని సేకరించడం ద్వారా, బ్రాండ్ ఉత్పత్తినిపెంచుతోంది, ఇది స్థానిక గిరిజన రైతులకు వారి గొప్పవ్యవసాయ వారసత్వాన్ని ప్రోత్సహించడమే కాకుండా సంరక్షించడం ద్వారా ప్రయోజనంచేకూరుస్తుంది.

ఈ ఆవిష్కరణ గురించి టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్, ప్యాకేజ్డ్ బేవరేజెస్, ఇండియా, దక్షిణాసియా అధ్యక్షుడు పునీత్ దాస్ మాట్లాడుతూ "టాటా ఉత్పత్తి, ఆర్గానిక్ ఇండియా, నిజంగా వినియోగదారులకు మాత్రమే కాకుండా పర్యావరణం,దానిలో భాగమైన సమాజాలకు కూడా ప్రయోజనం చేకూర్చే ఉత్పత్తులను అభివృద్ధి చేయడంనమ్ముతుంది. పర్యావరణ పరిరక్షణ పట్ల బ్రాండ్ యొక్క నిబద్ధతకు ఒక ఉదాహరణ, అరకు ఇన్‌స్టంట్ కాఫీ. ఈ ఉత్పత్తి కాఫీప్రియులకు అరకు లోయ రైతుల పనితనంను వేడుక జరుపుకునే ప్రత్యేకమైన మిశ్రమాన్నిఅందిస్తుంది" అని అన్నారు. ఈ ఉత్పత్తి 50 గ్రాముల ధర రూ.500. ఆర్గానిక్ ఇండియావెబ్‌సైట్, అమెజాన్, ఆర్గానిక్ ఇండియా స్టోర్‌లతోసహా వివిధ ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లలో అందుబాటులో ఉంది.




## ఈతరం పిల్లల్ని భవిష్యత్తులో నాయకులుగా తీర్చిదిద్దాలి

**కాలిబో అకాడమీ చైర్మన్ రాజ్**

**విజయవాడ మేజర్ న్యూస్ :** విజయవాడ గాంధీజీ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో బుధవారం కాలిబో ఆల్ అకాడమీ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. వట్టికుటి గ్రూప్ ఆఫ్ కంపెనీ & కాలిబో అకాడమీ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు రాజ్ ఈ కార్యక్రమానికి ఛైర్మన్ వ్యవహరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో వెనుకబడిన విద్యార్థులను శక్తివంతం చేయడానికి వట్టికుటి ఫౌండేషన్ ఆకాడమీ ప్రారంభించబడింది. విద్య ద్వారా తమ జీవితాలను మార్చుకోవచ్చు, సామాన్య విద్యార్థుల్లో ఉన్న సామర్థ్యం గుర్తించి నైపుణ్యం శిక్షణ అందించబడుతుందని.ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, పిల్లల ఉన్నత విద్యాభ్యాసం కోసం, ఆంధ్రప్రదేశ్ యువత డిజిటల్ వ్యాపారంలో నైపుణ్యాలను సాధించి, భవిష్యత్ నాయకులుగా ఎదగాలనే లక్ష్యంతో సెమినార్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్లో ముఖ్యమంత్రి వర్యులు చంద్రబాబు మద్దతుతో సహకారంతో రాబోయే కాలంలో వన్ మిలియన్ విద్యార్థులను చేరుకోవాలని ఆకాంక్షించారు. "నేను చదువుకున్న ఈ పాఠశాలకు సేవలందించడం నా మాతృదేశానికి సేవ చేసే అవకాశం దక్కడం నా అదృష్టంగా భావిస్తున్నాను" అని ఆయన గుర్తుచేశారు. తెలుగు సినీ రంగం మహానటుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు 1940లో ఈ పాఠశాలలోనే విద్యాభ్యాసం చేశారని తెలిసిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు, కాలిబో అకాడమీ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## జిగ్మా గ్లోబల్ ఎన్విరాన్ సొల్యూషన్స్ సంస్థకు లెగసీ వ్యర్థాల నిర్వహణలో అత్యుత్తమతకు గాను 2025 స్వచ్ఛ్ ఆంధ్ర అవార్డు

**విజయవాడ, అక్టోబర్ 15, మేజర్ న్యూస్ :** బ్లూ ప్లానెట్ ఎన్విరాన్‌మెంటల్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కి చెందిన జిగ్మా గ్లోబల్ ఎన్విరాన్ సొల్యూషన్స్ సంస్థ, రాష్ట్రంలో లెగసీ వ్యర్థాల శుద్ధి పనుల్లో చేసిన అద్భుత సేవల కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర అవార్డు 2025తో సత్కరించింది. ఈ గుర్తింపు, స్వచ్ఛ భారత్ మిషన్ - అర్బన్ 2.0 పరిధిలో ?123.60 కోట్ల విలువైన క్లస్టర్ ఆధారిత పునరుద్ధరణ ప్రాజెక్టులను సమర్థవంతంగా అమలు చేసిన జిగ్మా సంస్థ యొక్క విశిష్ట పనితీరును ప్రతిబింబిస్తుంది. రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో అమలు చేసిన ఈ ప్రాజెక్టులు, శాస్త్రీయ బయోరిమీడియేషన్, బయోమైనింగ్, భూమి పునరుద్ధరణపై దృష్టి సారించి, దశాబ్దాల నాటి వ్యర్థాల నిల్వ స్థలాలను పునరుద్ధరించిన భూమిగా మార్చి, రాష్ట్రవ్యాప్తంగా పర్యావరణ పునరుజ్జీవనానికి దోహదపడ్డాయి. ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం విజయవాడలో జరిగిన ఘన కార్యక్రమంలో, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేత ప్రదానం చేయబడింది. ఈ కార్యక్రమంలో మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ, స్వచ్ఛ్ ఆంధ్ర కార్పొరేషన్ యం ఎ యుడి శాఖకు చెందిన ఉన్నతాధికారులు హాజరయ్యారు.

**ప్రాజెక్ట్ అమలులో అత్యుత్తమత**

జిగ్మా సాధించిన ఈ విజయము, సంస్థ యొక్క అసాధారణ ప్రాజెక్ట్ అమలు సామర్థ్యాలను ప్రతిబింబిస్తుంది. సంస్థ మార్చి 2025లో తన బిడ్‌ను సమర్పించి, ఏప్రిల్ 2025లో అధికారిక ఒప్పందాలను కుదుర్చుకుంది. కార్యాచరణలో అద్భుత సమర్థతను ప్రదర్శిస్తూ, జిగ్మా మొత్తం 6 క్లస్టర్లలో పనులను చేపట్టి, 14.5 లక్షల టన్నుల వ్యర్థాలను ప్రాసెస్ చేసి, 50,000 టన్నులకుపైగా ఆర్ డి ఎఫ్ ను దేశంలోని ఐదు సిమెంట్ కర్మాగారాలకు పంపిణీ చేసింది. "స్వచ్ఛ్ ఆంధ్ర అవార్డు 2025 అందుకోవడం మా బృందానికి గర్వకారణమైన మైలురాయిగా నిలిచిందని అన్నారు.

# భరతమాత ముద్దుబిడ్డ భారతరత్న అబ్దుల్ కలాంకు ఘన నివాళులు

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** భరతమాత ముద్దుబిడ్డ భారతరత్న దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం 94వ జయంతిని పురస్కరించుకొని ఘనంగా నివాళులర్పించారు మాజీ శాసనసభ్యులు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త, రైతు విభాగం రీజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సింహాద్రి రమేష్ బాబు ఆదేశాల మేరకు బుధవారం నియోజకవర్గ వైయస్సార్ సిపి కార్యాలయంలో అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు ఈ సందర్భంగా కృష్ణా జిల్లా పంచాయతీ రాజ్ విభాగా అధ్యక్షులు సింహాద్రి వెంకటేశ్వర మాట్లాడుతూ 1931 అక్టోబర్ 15న జన్మించిన అబ్దుల్ కలాం 1962లో భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో చేరిన ఆయన ఇతర శాస్త్రవేత్తలతో కలిసి అనేక కృత్రిమ ఉపగ్రహాలను విజయవంతంగా ప్రయోగించాలని రోహిణి ఉపగ్రహాన్ని 1980 జూలైలో విజయవంతంగా భూమి సమీప కక్షలోకి వదిలిన అబ్దుల్ కలాం భారతదేశపు మొట్టమొదటి స్వదేశీ ప్రయోగ వాహనాన్ని అభివృద్ధి చేయడంలో ప్రాజెక్ట్ డైరెక్టర్గా ఆయన కృషి చెప్పలేను అన్నారు భారతదేశపు మూడు అత్యున్నత పురస్కారాలు అయిన పద్మభూషణ్ పద్మ విభూషణ్ భారతరత్న లతోపాటు 30 విశ్వవిద్యాలయాల నుండి గౌరవ డాక్టరేట్ పొందినటువంటి వ్యక్తి అబ్దుల్ కలాం అన్నారు 2002 జూలై 18న బ్రహ్మాండమైన మెజారిటీతో భారత రాష్ట్రపతిగా జులై 25వ తేదీన పదవీ శ్రీకారం చేశాడన్నారు తొలిసారిగా ఒక శాస్త్రవేత్త భారత దేశ ప్రధాని పౌరుడిగా ఎన్నిక కావడం కలాంకు లభించిన విశిష్ట గౌరవం అన్నారు ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ(లచ్చి), అవనిగడ్డ




వైఎస్ఆర్సీపీ మండల పార్టీ అధ్యక్షులు రేపల్లె శ్రీనివాసరావు, రాష్ట్ర వైఎస్ఆర్సీపీ ప్రచార విభాగం ప్రధాన కార్యదర్శి గాజుల జయగోపాల్(గోపి), అవనిగడ్డ నియోజకవర్గం వైఎస్ఆర్సీపీ యువజన విభాగం అధ్యక్షులు చింతలపూడి బాల భాస్కర్(బాలు), పాతఎడ్లలంక మాజీ సర్పంచ్ సైకం బాబురావు, వైఎస్ఆర్సీపీ నాయకులు గరికిపాటి కృష్ణారావు, కొల్లాల మధు, బచ్చు నాగమల్లేశ్వరరావు(బుజ్జి), రేపల్లె దామోదర్, కొండవీటి రాంప్రసాద్, ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ రియాజ్ భాష, సత్యనారాయణ, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




## శాంసంగ్ గెలాక్సీ ఎం17 5జీ అమ్మకాలు ప్రారంభం

**విజయవాడ మేజర్ న్యూస్ :** ఇటీవల విడుదల చేసిన గెలాక్సీ ఎం17 5జీ స్మార్ట్‌ఫోన్‌ను వినియోగదారులు కొనుగోలు చేయవచ్చని శాంసంగ్ ప్రకటించింది. ఇది అమెజాన్, శాంసంగ్ డాట్ కాంతో పాటు, ఎంపిక చేసిన రిటైల్ స్టోర్లలో అందుబాటులో ఉంటుంది. గెలాక్సీ ఎం17 5జీ, భారతదేశంలో అత్యధికంగా అమ్ముడైన శాంసంగ్ స్మార్ట్‌ఫోన్‌లలో ఒకటైన గెలాక్సీ ఎం16 5జీ విజయాన్ని కొనసాగిస్తూ, అత్యాధునిక ఏఐ ఆవిష్కరణలను మరింత ఎక్కువ మందికి చేరువ చేసే శాంసంగ్ సంప్రదాయాన్ని ముందుకు తీసుకు వెళుతోంది. ఇది రూ.10,000 రూ.15,000 ధరల విభాగంలో తొలిసారిగా "నో షేక్ కెమెరా ఫీచర్‌తో వస్తోంది. కేవలం 7.5 మి.మీ.ల మందంతో, ప్రీమియం కెమెరా డిజైన్‌తో పాటు, ఈ విభాగంలోనే అత్యుత్తమమైన కార్నింగ్ గొరిల్లా గ్లాస్ విక్టస్ ప్రొటెక్షన్‌తో అద్భుతమైన మన్నికను అందిస్తుంది.

## మేడ్ ఇన్ ఇండియా విండ్ ఫ్రీ క్యాసెట్ ఏసీలను ప్రారంభించిన సామ్‌సంగ్




**విజయవాడ మేజర్ న్యూస్ :** భారతదేశపు అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ సామ్‌సంగ్, తన తాజా మేడ్ ఇన్ ఇండియా స్మార్ట్ విండ్ ఫ్రీ క్యాసెట్ ఎయిర్ కండిషనర్లను విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. కొత్త లైనప్ తెలివైన కనెక్టివిటీ, పర్యావరణ అనుకూల డిజైన్, ప్రీమియం సౌకర్యాన్ని మిళితం చేసి, వాణిజ్య, నివాస శీతలీకరణ పరిష్కారాల భవిష్యత్తును మెరుగుపరుస్తుంది. తెలివైన నియంత్రణ, సమర్థవంతమైన పనితీరు, మెరుగైన శ్రేయస్సును అందించడానికి రూపొందించబడిన ఈ కొత్త శ్రేణిలో తిరుగులేని స్మార్ట్‌థింగ్స్ ఇంటిగ్రేషన్ కోసం అంతర్నిర్మిత వైఫై, సామ్‌సంగ్ ప్రత్యేక విండ్ ఫ్రీ కూలిం గ్ టెక్నాలజీ అమర్చబడి ఉన్నాయి. పర్యావరణ అనుకూలమైన ఆర్32 రిఫ్రిజెరాంట్ వాడకం స్థిరత్వం పట్ల సామ్‌సంగ్ నిబద్ధతను మరింత ధృవీకరిస్తుంది.

## దక్షిణ భారత వారసత్వాన్ని ఆవిష్కరించిన తనిష్క్ రివాహ్




**విజయవాడ మేజర్ న్యూస్ :** తనిష్క్ ప్రత్యే క వివాహ ఆభరణాల బ్రాండ్ 'రివాహ్', వారసత్వ హస్తకళల గొప్పతనాన్ని చాటు తూ, ఆధునిక డిజైన్లతో కూడిన అద్భుతమైన పెళ్లి, పండుగ నగల కలెక్షన్‌ను ఆవిష్కరించింది. దీపావళి, రాబోయే పెళ్లి ముహూర్తాలను దృష్టిలో ఉంచుకుని, రివాహ్ ఈ కలెక్షన్‌ను అందిస్తోంది. ఇందులో పెళ్లికి ముందు జరిగే చిన్న చిన్న వేడుకల నుండి, అంగరంగ వైభవంగా జరిగే వివాహ వేడుకల వరకు, ప్రతి సందర్భానికీ సరిపోయే ఆభరణాలు ఉన్నాయి. ప్రతి పెళ్లికూతురు వద్ద తప్పక ఉండాల్సినవిగా, పెళ్లి రోజుకే పరిమితం కాకుండా, తరతరాలు నిలిచిపోయే వారసత్వ సంపదగా ఈ ఆభరణాలను తీర్చిదిద్దారు. ఈ సీజన్‌లో సరికొత్త సొబగులు అద్దిన కాసుమాల, ఆలయ ఆభరణాల (టెంపుల్ జువెలరీ) శ్రేణి ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. ఇందులో లేయర్డ్ హారాలు, యాంటిక్ చోకర్లు, పెళ్లి గాజులు, వడ్డాణాలు, ఝుమ్కీలు వంటివి ఉన్నాయి. ప్రతి ఆభరణం యాంటిక్ క్రాఫ్ట్స్‌మెన్‌షిప్, టెక్స్‌చర్డ్ బంగారంతో ఎంతో సున్నితంగా రూపొందించబడింది. పురాతన నకాషి, స్టోన్‌వర్క్ టెక్నిక్స్‌తో వారసత్వ మోటిఫ్‌లకు జీవం పోశారు. ఇవి సంప్రదాయబద్ధంగా కనిపిస్తూనే, నేటి ఆధునిక వధువుకు తగినట్లుగా ఉంటాయని తనిష్క్ చీఫ్ డిజైన్ ఆఫీసర్ రేవతి కాంత్ పేర్కొన్నారు.



## బొడ్డపాడు గ్రామ సర్పంచికి మాతృ వియోగం

### నివాళులర్పించి అంతిమయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే కుమార్ రాజా

**తోట్లవల్లూరు మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని బొడ్డపాడు గ్రామ సర్పంచ్ మూడే శివశంకరరావు తల్లి సుశీల హఠాన్మరణం చెందారు. గత నెలలో శివశంకరరావు సోదరుడు శ్రీనివాసరావు హఠాన్మరణం చెందగా స్వల్ప వ్యవధిలోనే ఆయన మాతృమూర్తి కూడా మరణించడం ఆ ఇంట తీవ్ర విషాదాన్ని నింపింది. కాగా ఈ సమాచారం తెలుసుకున్న పామర్రు శాసన సభ్యులు వర్ల కుమార్ రాజా బుధవారం శివశంకరరావు ఇంటికి వెళ్లి సుశీల మృత దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి కుటుంబంలో వెంటవెంటనే ఇటువంటి కార్యక్రమాలు జరగడం చాలా బాధాకరమని పేర్కొన్నారు. అనంతరం జరిగిన సుశీల అంతిమయాత్రలో ఎమ్మెల్యే కుమార్ రాజా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గర్వించదగ్గ క్షిపణి శాస్త్రవేత్త అబ్దుల్ కలాం

### గాంధీ క్షేత్రంలో ఘనంగా కలాం జయంతి



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** భారతదేశం గర్వించదగ్గ క్షిపణి శాస్త్రవేత్త ఏపీజే అబ్దుల్ కలాం అని ఎమ్మెల్యే తనయుడు, గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్ అన్నారు. బుధవారం మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా స్థానిక గాంధీ క్షేత్రంలోని కలాం విగ్రహానికి వెంకట్రామ్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. భారతదేశపు మిస్సైల్ మాన్ గా ఖ్యాతి పొందిన కలాం గర్వించదగ్గ పోఖ్రాన్ అణు పరీక్షల్లో కీలకమైన సంస్థాగత, సాంకేతిక పాత్ర పోషించారని స్మరించుకున్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

### మంగళగిరి జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో

## ప్రజల నుండి అర్జీలు స్వీకరించిన బండి రామకృష్ణ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు జనవాణి జనసేన భరోసా కార్యక్రమంలో బుధవారం మచిలీపట్నం జనసేన పార్టీ ఇంచార్జ్ ఉమ్మడి కృష్ణాజిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ బండిరామ కృష్ణ మంగళగిరి జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రజల నుండి అర్జీలు స్వీకరించి పరిష్కరించదగిన సమస్యల పరిష్కారం కొరకు సంబంధిత అధికారులతో చరవాణిలో సంభాషించి బాధితుల సమస్యలు పరిష్కరించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం మండల, పట్టణ అధ్యక్షులు గళ్లాతిమోతి,గడ్డంరాజు ఏఎంసి వైస్ చైర్మన్ చిలంకుర్తి పిచ్చేశ్వరరావు పాల్గొన్నారు..

# స్వచ్ఛమైన గాలికి సమష్టిగా కృషిచేద్దాం..



**ఎన్‌టీఆర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 15, మేజర్ న్యూస్ :** ఈ నెల 18వ తేదీన స్వచ్ఛమైన గాలి (క్లీన్ ఎయిర్) ఇతివృత్తంతో నిర్వహించనున్న స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల విజయవంతానికి ప్రణాళికాయుత కృషిచేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ లక్ష్మీశ.. జిల్లా, మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మా ట్లాడుతూ సుసంపన్నమైన, ఆరోగ్యవంతమైన, సంతోషకరమైన ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఆవిష్కరించిన స్వర్ణాంధ్ర ఏ 2047 దార్శనిక పత్రంలోని పది సూత్రాల్లో సమగ్ర విధానాలతో స్వచ్ఛాంధ్ర అనేది ఒక సూ త్రంగా ఉందని వివరించారు. ఈ నేపథ్యంలో ప్రతి నెలా మూడో శనివారం ఒక ప్రత్యేక థీమ్‌తో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల మూడో శనివారం క్లీన్ ఎయిర్ థీమ్‌తో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. గాలి కాలుష్య కారకాలకు అడ్డుకట్ట వేస్తూ హరిత విస్తీర్ణం పెంచడం ద్వారా స్వచ్ఛమైన గాలిని ఐశ్వర్యంగా పొందొచ్చ న్నారు. గాలి కాలుష్యం వల్ల ఎదురయ్యే అనారోగ్య సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజా రవాణా వ్యవస్థ, సౌర విద్యుత్ వినియోగం వంటి వాటిని ప్రోత్సహించాలన్నారు. నిత్య జీవిత ప్రయాణాన్ని పర్యావరణ హిత మార్గంలో సాగించేలా అవగాహన కల్పించాలని.. హానికర టపాసులు కాకుం డా దీపాల కాంతులతో పర్యావరణహిత దీపావళిని జరుపుకుందామని.. అధికారులు, సిబ్బంది కూడా ఇదే బాటలో నడిచి భావితరాలకు స్వచ్ఛమైన గాలి రూపంలో వెలకట్టలేని సంపదను బహుమతిగా అందించడంలో భాగస్వాములమవుదామని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. సమావేశంలో డీపీవో పి.లావణ్య కుమారి తదితరులు పాల్గొన్నారు.

# గాంధీ శిల్ప బజార్‌కు విశేష స్పందన..







**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 15, మేజర్ న్యూస్ :** దేశ సాంస్కృతిక వైభవానికి చిహ్నాలైన చేనేత, హస్తకళా ఉత్పత్తుల విశిష్ట సంపదను భావి తరాలకు అందించాలనే ప్రయత్నంలో భాగంగా నగరంలో ఈ నెల 10న ప్రారంభించిన గాంధీ శిల్ప బజార్‌కు విశేష స్పందన లభిస్తోందని.. దేశ వ్యాప్త హస్తకళా ఉత్పత్తులు ఒకే వేదికపై అందుబాటులో ఉన్న శిల్ప బజార్ ఈ నెల 19వ తేదీ వరకు మరో నాలుగు రోజులే అందుబాటులో ఉంటుందని, ఔత్సాహికులు సందర్శించి కళాకారులను ప్రోత్సహించాలని లేపాక్షి వీసీ, ఎండీ ఎం.విశ్వ బుధవారం తెలిపారు. విజయవాడ పటమట ఎన్‌టీఆర్ సర్కిల్ సమీపంలోని మేరీస్ స్టెల్లా ఇండోర్ స్టేడియంలో అఖిల భారత హస్తకళా వస్తువులు, కళాత్మక వస్త్ర ప్రదర్శన, అమ్మకం వేదిక గాంధీ శిల్ప బజార్‌లో దేశ వ్యాప్తంగా హస్తకళాకారులు తయారుచేసిన ఉత్పత్తులను ఒకే వేదికపై తీసుకువచ్చి ప్రదర్శించడంతో పాటు అమ్మకాలు నిర్వహించడం జరుగుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వ హ్యాండీక్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కమిషనర్ సహకారంతో నిర్వహిస్తున్న గాంధీ శిల్ప బజార్‌లో మంగళగిరి, పోచంపల్లి, వెంకటగిరి, గద్వాల్, సిద్దిపేట్, నారాయణపేట్, చీరాల, కలంకారి, బాటిక్ ప్రింటింగ్, బెంగాలి కాటన్, కాశ్మీరి సిల్క్, కోసా సిల్క్, మధురై, లక్నో చికన్ వర్క్, నారాయణవరం, గాగ్రా చోళి, కాటన్ ప్రింటెడ్, సంబల్పూర్, కోసా (టస్సర్), ఆప్లిక్ వర్క్, ప్యాచ్ వర్క్, ఖాదీ మెటీరియల్, బెడ్ షీట్స్ వంటివి అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ప్రతిరోజు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు గాంధీ శిల్ప బజార్ అందుబాటులో ఉంటుందని, రూ. కోటి విలువైన అమ్మకాలు లక్ష్యం కాగా ఇప్పటివరకు రూ. 40 లక్షల విలువైన వస్తువులను ఔత్సాహికులు కొనుగోలు చేసినట్లు లేపాక్షి వీసీ, ఎండీ ఎం.విశ్వ వెల్లడించారు.

# వీధి వ్యాపారస్తులకు శిక్షణా కార్యక్రమం




**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** విజయవాడ నగర పాలక సంస్థ పరిధి లో ఫుడ్ వెండింగ్ చేయుచున్న 500 మంది వీధి వ్యాపారస్తులకు బుధవారం తుమ్మలపల్లి కళా క్షేత్రంలో ఆహార భద్రత & నాణ్యత అథారిటీ ఆఫ్ ఇండియా,సౌత్ రీజినల్ ఆఫీస్ వారి ద్వారా శిక్షణా కార్యక్రమము నిర్వహించడం జరిగినది. ఆ శిక్షణా కార్యక్రమం లో ఆహార భద్రత & నాణ్యత, లైసెన్స్ పొందడం గురించి శిక్షణ ఇవ్వడమైనది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ప్రాజెక్ట్ ఆఫీసర్, వి.యం.సి, పిడుగు వెంకట నారాయణ గారు పాల్గొని, ఫుడ్ వెండింగ్ చేయుచున్న వీధి వ్యాపారస్తులు తప్పనిసరిగా ఆహార భద్రత & నాణ్యత ధృవీకరణ పత్రము పొంది వ్యాపారము కొనసాగించాలని, వ్యాపారము చేయు ప్రాంతము, పరిసర ప్రదేశములు పరిశుభ్రత పాటించాలని, వ్యాపారాలకు కావలసిన ఆర్థిక సహాయం కొరకు పి.యం స్వానిధి 2.0 ద్వారా బ్యాంకు ఋణాలు ఇవ్వబడునని, ఈ ఋణాలు మెదటి విడత రూ. 15,000/-,రెండవ విడత రూ.25,000/-, మూడవ విడత రూ 50,000, క్రెడిట్ కార్డు రూ.30,000/- లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ శిక్షణకు హాజరైన వారికి యాప్రాన్,మాస్క్ లు,టోపీ లతో కూడిన కిట్ లు ఉచితంగా పంపిణి చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో డా॥ ఆంజనేయులు.చాగంటి, ఫుడ్ సేఫ్టి ట్రైనర్, కె సాయి శివ, టెక్నికల్ ఆఫీసర్, ఆహార భద్రత & నాణ్యత అధారిటి, యన్.రమేష్ బాబు, గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్, జి.యన్ లక్ష్మణ రావు, డిప్యూటి మేనేజర్, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, యస్.శివ రాం, మేనేజర్, వి.యం.సి బ్రాంచి,స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా, టౌన్ వెండింగ్ కమిటి సభ్యులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

# స్వర్గపురిలో స్నాన గదులు, మరుగుదొడ్లు మరమ్మతులు చేయండి






**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** స్వర్గపురిలో స్నాన గదులు, మరుగుదొడ్లు మరమ్మతులు చెయ్యాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. బుధవారం ఉదయం తన పర్యటనలో భాగంగా కృష్ణలంక ప్రాంతంలోని మలేరియా ఆఫీస్ రోడ్డు, మస్జిద్ రోడ్డు, గంగానమ్మ గుడి, హై స్కూల్ రోడ్ పటమట ప్రాంతాలన్నీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వర్గపురిలో మొక్కలు పెట్టి హరితానీ పెంచాలని, స్నాన గదులు, మరుగుదొడ్లు, స్వర్గపురిలో వచ్చే వారికి కావాల్సిన కనీస అవసరాలు తీర్చేటట్టు మరమ్మతులు చేయించాలని అధికారులను ఆదేశించారు. నగర పరిధిలో గల అన్ని స్వర్గపురిలను అధికారులు పరిశీలించి ఎప్పటికప్పుడు వాటిలోని సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. తదుపరి పటమట లోని అన్న క్యాంటీన్ ను పరిశీలించారు. అన్న క్యాంటీన్లో కల్పించే పద్ధతులలో ఎటువంటి సమస్యలు ఉండరాదని ఏమైనా మరమ్మతులు వచ్చినచో వెంటనే 15 నిమిషాల్లో వాటిని పూర్తి చేయాలని ప్రతిరోజు అధికారులు తమ తమ అన్న క్యాంటీన్లను పరిశీలించి అక్కడికి వస్తున్న ప్రజలతో మాట్లాడి అభిప్రాయాలు తెలుసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ కే షమ్మీ, ఎస్టేట్ ఆఫీసర్ ఏ శ్రీధర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి సామ్రాజ్యం, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.










## మేఘా కృష్ణారెడ్డి మాతృమూర్తి విజయలక్ష్మికి ఘననివాళులు

**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** మేఘా కృష్ణారెడ్డి మాతృమూర్తి పురిటిపాటి విజయలక్ష్మికి ఆంధ్ర ప్రదేశ్ గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ , తెలంగాణ ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి తో పాటు పలువురు ప్రముఖులు, కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, వివిధ రంగాలకు చెందిన అధికార, అనధికార ప్రముఖులు మేఘా సంస్థ అధికారులు, సిబ్బంది బుధవారం ఘనంగా నివాళులు అర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. సానుభూతి తెలిపారు. ఎం ఈ ఐ ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ పీవీ కృష్ణారెడ్డి మాతృమూర్తి పీ విజయలక్ష్మి ఈ నెల ఐదో తేదీన తుదిశ్వాస విడిచారు. విజయలక్ష్మి సంస్మరణ కార్యక్రమం బుధవారం హైదరాబాద్ లోని హైటెక్స్ లో జరిగింది. తొలుత భర్త పీ వీరారెడ్డి, కుమారులు ఎం ఈ ఐ ఎల్ ఎం డీ పీవీ కృష్ణా రెడ్డి, ఎం ఈ ఐ ఎల్ సీఈఓ పీవీ సుబ్బారెడ్డి, కుమార్తె ప్రసన్న, సోదరుడు , ఎం ఈ ఐ ఎల్ చైర్మన్ పీపీ రెడ్డితో పాటు వారి కుటుంబ సభ్యులు హైటెక్స్ లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై విజయలక్ష్మి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆంధ్ర ప్రదేశ్ గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కేంద్ర మంత్రులు జి కిషన్ రెడ్డి, భూపతిరాజు శ్రీనివాసవర్మ, బండి సంజయ్, మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు, సుప్రీమ్ కోర్ట్ మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, ఆంధ్ర ప్రదేశ్ శాసనసభ ఉప సభాపతి ఆర్ రఘురామకృష్ణంరాజు, తెలంగాణ రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తెలంగాణ ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, మహమ్మద్ అలీ షబ్బీర్ , ఎం పీలు సీఎం రమేష్,కే రఘువీర్ రెడ్డి, డి కె అరుణ, తెలంగాణ రాష్ట్రసమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారకరామారావు, ఎం ఎల్ ఏ లు టి హరీష్ రావు, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, తలసాని శ్రీనివాసయాదవ్ , సినీ నటులు కొణిదెల చిరంజీవి, దగ్గుబాటి వెంకటేష్, మాజీ ఎం పీ లు కేవీపీ రామచంద్ర రావు , ఏపీ జితేందర్ రెడ్డి, మధుయాష్కీ గౌడ్, తెలంగాణ హోమ్ శాఖ ప్రత్యేక కార్యదర్శి సి వీ ఆనంద్, సినీ నిర్మాత దగ్గుబాటి సురేష్, ఏబీఎన్ ఆంధ్ర జ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ, మై హోమ్ గ్రూప్ సంస్థల చైర్మన్ జూపల్లి రామేశ్వర రావు, వై ఎస్ ఆర్ సీపీ నేత బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, టీడీపీ నేత జేసీ పవన్ రెడ్డి తదితర ప్రముఖులు విజయలక్ష్మికి నివాళులు అర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మేఘా ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది కూడా నివాళులు అర్పించారు.

# సీఎం చంద్రబాబు నాయకత్వంలో అభివృద్ధిని అడ్డుకోవటం అసాధ్యం

**గుగూల్ సంస్థ రాష్ట్రంలో నెలకొల్పటం ప్రపంచంలోని తెలుగువారందరూ గర్వించదగ్గ విషయం**

**టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా వెల్లడి**

**ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయంలో మీడియా సమావేశం**

**సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ కృతజ్ఞతలు**

**గుగూల్ డేటా సెంటర్ ఏర్పాటుతో లక్షమందికి పరోక్షంగా, ప్రత్యక్షంగా ఉద్యోగావకాశాలు**

**వైజాగ్‌కి గుగూల్ డేటా సెంటర్ రావటానికి మంత్రి నారా లోకేష్ కీలకపాత్ర**

**ప్రపంచంలోని పెద్ద కంపెనీలు ఏపీ వైపు చూస్తున్నాయనటానికి ఇదొక నిదర్శనం**

**దోచుకోవాలి...దాచుకోవాలనేది గత వైసీపీ ప్రభుత్వం లక్షణం**

**రాష్ట్రాభివృద్ధిని అడ్డుకోవటానికి వైసీపీ కుట్ర పూరిత చర్యలు**

**కూటమి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం...సంక్షేమం, అభివృద్ధే లక్ష్యం**

**విజయవాడ మేజర్ న్యూస్ :** ప్రపంచంలోనే అతి పెద్ద సంస్థ అయిన గుగూల్ కంపెనీ అభివృద్ధి చెందిన దేశాల్లో కాకుండా డేటా సెంటర్ ఏర్పాటుకు ఆంధ్ర ప్రదేశ్‌ను ఎంచుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేష్ కృషే కారణమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా అన్నారు. వైజాగ్ లో లక్ష ముప్పై వేల కోట్ల రూపాయల పెట్టుబడితో గుగూల్ సంస్థ ఏర్పాటు చేయనున్న డేటా సెంటర్ వల్ల దాదాపు లక్షమంది యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగావకాశాలు లభిస్తాయని నాగుల్ మీరా చెప్పారు. రాష్ట్రంలో గుగూల్ సంస్థ డేటా సెంటర్ నెలకొల్పేందుకు కృషి చేసిన సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ కృతజ్ఞతలు తెలిపేందుకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా బుధవారం గురునానక్ కాలనీ లోని ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారాలోకేష్ నాయకత్వంలో రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి దిశగా దూసుకుపోతుందన్నారు. అమెరికాలోనే అతి పెద్ద సంస్థ గుగూల్ ను రాష్ట్రానికి తీసుకురావటంలో ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఈ విషయం సీఎం చంద్రబాబే స్వయంగా చెప్పి మంత్రి నారా లోకేష్ ను ప్రశంసించారని గుర్తు చేశారు. చంద్రబాబు నాయుడు సీఎంగా వుంటే ప్రపంచంలోని పెద్ద కంపెనీలన్నీ ఏపీ వైపు చూస్తాయనటానికి ఇదొక గొప్ప నిదర్శనమన్నారు. ప్రపంచం నలుమూలల ఐటీ రంగంతో పాటు ఇతర రంగాల్లో తెలుగు వారు రాణించటానికి ఆనాడు ముఖ్యమంత్రిగా చంద్రబాబు తీసుకున్న నిర్ణయాలే కారణమన్నారు. బెంగుళూర్, పుణే, చెన్నైకి పరిమితమైన ఐటి రంగాన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కి పరిచయం చేసిన నాయకుడు సీఎం చంద్రబాబు అంటూ కొనియాడారు. నేడు తెలంగాణ రాష్ట్రం కేవలం హైదరాబాద్ నగరం మీద ఆర్థికంగా ఆధారపడిన నేపథ్యం వుందంటే దానికి చంద్రబాబు విజన్ 2020 కారణమన్నారు. ఇక మంత్రి నారా లోకేష్ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించటంతో పాటు ఉద్యోగావకాశాలు కూడా రాష్ట్రంలోనే కల్పించేందుకు కృషి చేస్తున్నారన్నారు. వైజాగ్ ను ఒక ఐటీ హబ్ గా తయారు చేయాలనే సంకల్పంతో మంత్రి నారా లోకేష్ ముందుకు వెళుతున్నారని తెలిపారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం, రాష్ట్రాభివృద్ధి కోసం పనిచేస్తోందన్నారు. రాష్ట్రానికి ఇతర దేశాల నుంచి, ఇతర రాష్ట్రాల నుంచి పెట్టుబడులు రావటానికి రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పాలన సాగించటం కారణమన్నారు. వైసీపీ అప్పుడు ఇప్పుడు రాష్ట్రానికి పరిశ్రమలు రాకూడదని కోరుకుంటుందన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రాభివృద్ధిని ఆపటం అంటే సూర్యకాంతిని అరచేతితో ఆపినట్లేనన్నారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో విధ్వంసకరమైన పాలన సాగటంతోపాటు, రాష్ట్రానికి ఏ కంపెనీలు, పరిశ్రమలు రాకుండా అడ్డుకున్నారని మండిపడ్డారు. అంతే కాదు రాష్ట్రంలో వున్న అమర్ రాజా బ్యాటరీస్ కంపెనీని కూడా బయటికి పంపించే ప్రయత్నం చేశారన్నారు. వైసీపీ ప్రభుత్వ హయంలో పెట్టుబడి పెట్టాలనుకున్న పరిశ్రమలు, కంపెనీల నుంచి ఏదో ఆశించటంతో వాళ్లు వెనక్కి వెళ్లిపోయిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రజలు



అవకాశం ఇచ్చినప్పుడు ఏ ప్రభుత్వమైనా ప్రజలకు మేలు కలిగేలా, రాష్ట్రానికి ఆర్థికంగా పరిపుష్టి ఇవ్వటానికి ప్రయత్నించాలన్నారు. కానీ వైసీపీ ప్రభుత్వ పాలన రాష్ట్రంలో దోచుకోవాలి..దాచుకోవాలనే లక్షణంతో సాగిందని వివరించారు. వైసీపీ దోపిడి పాలనతో రాష్ట్రానికి పది లక్షల కోట్లు అప్పు మిగలటంతో రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లోకి వెళ్లిందన్నారు. అయినా సీఎం చంద్రబాబు సంక్షేమ పథకాల అమల్లో ఎలాంటి జాప్యం చేయలేదని, సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేశారన్నారు. అవినీతిలో కూరుకుపోయిన వైసీపీ నేతలకు నైతికంగా మాట్లాడే హక్కు లేదన్నారు.. రాష్ట్రాభివృద్ధిని అడ్డుకోవటానికి వైసీపీ కుట్ర పూరిత చర్యలకు పాల్పడుతుందన్నారు. పేదలకు పంపిణీ చేసే రేషన్ బియ్యాన్ని అమ్ముకుని అడ్డంగా దొరికిన దొంగ పేర్ని నాని, ఇబ్రహీంపట్నంలో నకిలీ మద్యం వ్యాపారానికి మాఫియా లీడర్ గా తయారైన జోగి రమేష్ లాంటి వైసీపీ నేతలంతా నీతులు మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా వుందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో వైసీపీ నాయకులు లిక్కర్ స్కామ్ లో మూడు వేల ఐదు వందల కోట్లు వైసీపీ నాయకులు దోచుకున్నారని గుర్తు చేశారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. గుగూల్ లాంటిసంస్థతో పాటుగా రాబోయే రోజుల్లో అనేక సంస్థలు రాష్ట్రానికి రానున్నాయని స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో, ప్రధాన మంత్రి మోదీ సహకారంతో రాష్ట్రం శరవేగంగా ముందుకు వెళ్లటం ఖాయమన్నారు.

# గ్రేట్ అమరావతి షాపింగ్ ఫెస్టివల్‌లో రోజూ లక్కీడ్రా



**ఎన్‌టీఆర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 15, మేజర్ న్యూస్ :** ఈ నెల 13న నగరం లోని పున్నమిఘాట్‌లో ప్రారంభమైన గ్రేట్ అమరావతి షాపింగ్ ఫెస్టివల్‌లో ప్రతిరోజూ లక్కీడ్రా నిర్వహిస్తున్నామని.. కొనుగోలుదారులు ఆకర్షణీయమైన బహుమతులు సొంతం చేసుకుంటున్నారని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ తెలిపారు. సూపర్ జీఎస్‌టీ - సూపర్ సేవింగ్స్ అవగాహన కార్యక్రమాల్లో భాగంగా జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ వారి మార్గనిర్దేశనంతో రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ, జిల్లా అధికార యంత్రాంగం, విజయవాడ

## కొనుగోలుదారులకు ఆకర్షణీయ బహుమతుల బొనాంజా

## చివరిరోజు బంపర్ డ్రాలో విజేతకు స్కూటీ బహుమతి

## సూపర్ జీఎస్‌టీ సూపర్ సేవింగ్స్ ఉత్సవాలను సద్వినియోగం చేసుకోండి

## ఎన్‌టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ

నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న షాపింగ్ ఫెస్టివల్‌లో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్, స్థానిక హస్తకళాకారుల ఉత్పత్తులు వంటి స్టాళ్లు ఉన్నాయని.. ప్రజలు ఈ ఫెస్ట్‌ను సందర్శించి వినోదంతో పాటు ప్రత్యేక ఆఫర్లు, జీఎస్‌టీ సేవింగ్స్‌తో షాపింగ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రతి కొనుగోలుపై కూపన్లు అందించి ప్రతిరోజూ లక్కీడ్రా తీసి విజేతలను ఎంపిక చేసి ఆకర్షణీయ బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు. ఫెస్టివల్ చివరి రోజు బంపర్‌డ్రా నిర్వహించి విజేతకు స్కూటీ బహుకరించనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 19వ తేదీ వరకు జరగనున్న గ్రేట్ అమరావతి షాపింగ్ ఫెస్టివల్ ద్వారా ప్రజలకు నాణ్యమైన ఉత్పత్తులు తగ్గిన జీఎస్‌టీ రేట్లతో, ప్రత్యేక రాయితీలతో వ్యాపార, వాణిజ్య సంస్థలు అందిస్తున్నాయని.. సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు లక్కీడ్రా వంటి మనోరంజక కార్యక్రమాల ద్వారా సందర్శకులు, కొనుగోలుదారుల్లో ఆనందం వెల్లివిరుస్తోందని.. ఫెస్ట్‌ను విజయవంతంగా ముందుకుతీసుకెళ్తున్న స్టాళ్ల యజమానులకు, సందర్శకులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు జేసీ ఇలక్కియ పేర్కొన్నారు.

# ఘనంగా ఏపీజే అబ్దుల్ కలాం జయంతి



ఘన నివాళులర్పించిన టీడీపీ శ్రేణులు

**జి.కొండూరు మేజర్ న్యూస్ :** మైలవరం లోని స్థానిక టిడిపి శాసన సభ్యుని కార్యాలయంలో బుధవారం ఏపీజే అబ్దుల్ కలాం 94వ జయంతి సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ఆదేశాలనుసారంగా తెలుగుదేశం పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ భారతదేశ రక్షణ రంగాన్ని అగ్రపథంలో నిలిపి, అంతరిక్ష, క్షిపణి పరిజ్ఞానాల స్వావలంబనలో కీలక భూమిక పోషించి, దేశ ఖ్యాతిని విశ్వవ్యాప్తంగా ఇనుమడింప చేసిన గొప్ప శాస్త్రజ్ఞుడు, మాజీ రాష్ట్రపతి, భారతరత్న గ్రహీత ఏపీజే అబ్దుల్ కలాంని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని, ఆ మహనీయుని సేవలను స్మరిస్తూ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తెలుగు యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



గొల్లపూడిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో...

భారతీయుల ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పిన క్షిపణి పితామహుడు డా. ఏపీజే అబ్దుల్ కలాం అని తెలుగుదేశం పార్టీ నాయకులు పేర్కొన్నారు. విజయవాడ రూరల్ మండలంలో గొల్లపూడిలో టీడీపీ కార్యాలయంలో (ఎమ్మెల్యే కార్యాలయం) డా. ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా పార్టీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి బుధ వారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ నేతలు మాట్లా డుతూ భారతదేశ రక్షణ రంగాన్ని అగ్రపథంలో నిలిపి, దేశ ఖ్యాతిని విశ్వవ్యా ప్తంగా ఇనుమడింప చేసిన గొప్ప శాస్త్రజ్ఞుడు, మాజీ రాష్ట్రపతి, భారతరత్న ఏపిజే అబ్దుల్ కలాం అని కొనియాడారు. ఆయన సేవలను స్మరించారు. నేటి యువతకు ఆయన స్ఫూర్తి దాయకం అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొమ్మసాని సుబ్బారావు, గొల్లపూడి ఏ.ఎం.సి చైర్మన్ నర్రా వాసు, టీడీపీ గొల్లపూడి గ్రామ శాఖ అధ్యక్షుడు నూతులపాటి నారద, తదితర ఎన్డీఏ కూటమి, టీడీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

# ఐనపూరు హైస్కూల్‌కు 20 చేతి కుర్చీలు బహుకరణ

**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** పమిడిముక్కల మండలం ఐనపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు స్థానిక కూడేరు గ్రామంలో వేంచేసియున్న శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయ చైర్మన్, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు అయిన దొడ్డా పూర్ణచంద్రరావు కుమారుడు దొడ్డా సూర్య వెంకట ప్రసాద్, 15వేలు రూపాయలు విలువచేసే 20 పెద్ద చేతి కుర్చీలు బహుకరించారు. ఈ కుర్చీలను పాఠశాల ఎస్ఎంసి కమిటీ చైర్మన్ దూడల శివ నాగ భవాని, కూడేరు గ్రామ సర్పంచ్ వీర్ల నాగరాజు, కూడేరు గ్రామ ఎంపీటీసీ వీర్ల ఆదిశేషు, ఐనపూరు గ్రామ సర్పంచ్ కొండా జయలక్ష్మి బసివిరెడ్డి దంపతుల చేతుల మీదుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు తమ్మన వేణుగోపాలరావుకు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దాత దొడ్డా సూర్య వెంకట ప్రసాద్ మాట్లాడుతూ ఐనపూరు హైస్కూల్ కు తమ వంతు సహాయం చేద్దామనే ఉద్దేశంతో 20 పెద్ద చేతి కుర్చీలను, శ్రీ షిరిడి సాయినాథుని ఆశీస్సులతో పాఠశాలకు బహుకరించడం జరిగిందన్నారు. అంతేకాకుండా గత కొన్ని సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్ లు, బాక్సులు, పుస్తకాలు కూడా ఆ సాయినాథుని ఆశీస్సులతో తమ శక్తి మేరకు అందజేస్తున్నామని తెలియజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు తమ్మన వేణుగోపాలరావు మాట్లాడుతూ దాత సూర్య వెంకట ప్రసాద్‌కు తమ పాఠశాల విద్యా కుటుంబం అందరి తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. పాఠశాల ఎస్ఎంసి కమిటీ చైర్మన్ దూడల శివ నాగ భవాని మాట్లాడుతూ ప్రతి సంవత్సరం దాత దొడ్డా పూర్ణచంద్రరావు ద్వారా పిల్లలకు అందించే మెటీరియల్ పిల్లలకు




ఎంతగానో ఉపయోగపడుతుందని, పిల్లలందరూ వాటిని బాగా ఉపయోగించుకుని మంచిగా విద్యను అభ్యసిస్తున్నారని తెలియజేశారు. కూడేరు గ్రామ సర్పంచ్ వీర్ల నాగరాజు, ఎంపీటీసీ సభ్యులు వీర్ల ఆదిశేషు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి దాతలు పూర్ణచంద్రరావు, సూర్య వెంకటప్రసాద్ లు ఎంతగానో సహకరిస్తున్నారని తెలియజేస్తూ, ఇకముందు కూడా వారి సహాయ సహకారాలు ఇలాగే అందించాలని ఆశిస్తూ, వారికి కూడేరు గ్రామ ప్రజలందరి తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. ఐనపూరు గ్రామ సర్పంచ్ కొండా జయలక్ష్మి బసివిరెడ్డి దంపతులు మాట్లాడుతూ పాఠశాలకు అనేక రకాలుగా సహాయ సహకారాలు అందిస్తున్న దాతలకు గ్రామ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## వాటర్ ప్లాంట్‌కు మర్మత్తులు చేయించండి

**ఏ.కొండూరు, మేజర్ న్యూస్:** మినరల్ వాటర్ ప్లాంట్‌కు మరమ్మత్తులు చేయించాలని కోరుతూ స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జనసేన నాయకులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు సిద్ధం శెట్టి రవీంద్ర, మరీదు శివకృష్ణ మాట్లాడుతూ మండలంలోని రామ చంద్ర పురం గ్రామ పంచాయతీ పరిధిలో గల ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ వారు 2018లో 13 లక్షల రూపాయాలతో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్ కొన్ని వారాలుగా మర్మత్తులకు గురి కావడంతో గ్రామ ప్రజలు తాగునీటి యద్దడిని ఎదుర్కొంటున్నారన్నారు. గ్రామంలో త్రాగు నీటి పైపు లైన్ లీకులు ఉన్నాయని తాగునీటి ప్లాంట్ కూడా కొన్ని రోజులుగా పూర్తి స్థాయిలో పని చెయ్యక పోవడంతో చీమలపాడు గ్రామానికి వెళ్లి మినరల్ వాటర్‌ను తీసుకువెళ్లే పరిస్థితులు వచ్చాయన్నారు. మినరల్ వాటర్ ప్లాంట్ మరమ్మత్తులకు గురై వారాలు గడుస్తున్న అధికారులు ఎవరు పట్టించుకోవడం లేదన్నారు. వాటర్ ప్లాంట్ మిషనరీ బిగించి ఇప్పటికీ 7 సం.లు గడుస్తున్న తాత్కాలిక మార్మత్తులు తప్ప శాశ్వత మర్మమత్తులు చేయించిన సందర్భాలు లేవన్నారు. తక్షణమే వాటర్ ప్లాంట్ తో పాటు పైపు లైన్ లీకేజ్ మరమ్మతులు చేయించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సచివాలయానికి శాశ్వత పంచాయతీ కార్యదర్శిని నియమించాలని ఎంపీడీవో పి శ్రీనివాసరావుకు వినతి పత్రం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్డెంట్ సాయిరాం, దాసరి నరేష్ కుమార్, ఉల్లిందల గాంధీ పాల్గొన్నారు.

## భూమి ఆరోగ్యం, భూసార పథకంపై అవగాహన



**పెడన, మేజర్ న్యూస్ :** ప్రధాని రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం భూమి ఆరోగ్యం, భూసార పథకం గురించి రైతులకు అవగాహన సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించామని కృష్ణాజిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ మనోహర్ రావు తెలిపారు. ఈ మేరకు నడుపూరు సచివాలయంలో రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వనరుల కేంద్రం నుంచి డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ జ్యోతిరమణి, వ్యవసాయ అధికారి పద్మజారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పథకం యొక్కముఖ్య ఉద్దేశాన్ని డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ మనోహర్ రావు రైతులకు వివరించారు. మట్టి నమూనాల ప్రాముఖ్యత, మట్టి నమూనాలు ఎట్లా సేకరించాలో రైతులకు జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ జ్యోతిరామణి వివరించారు. సాయిల్ హెల్త్ కార్డులు గురించి ఏవో పద్మజారాణి వివరించారు. రైతులు ఈ పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారిని ఎస్ జెన్నీ తెలిపారు. పెడన మండలానికి మొత్తం 18 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు కూడా తెలిపారు. ఈ కార్యక్రమానికి సాయి కిరణ్, నీటి సంఘం నాయకులు వెంకటేశ్వరరావు, నడుపూరు గ్రామ రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.



విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్య నందు నందిగామ టౌన్, నందిగామ రూరల్, కంచికచర్ల, వీరులపాడు, చందర్లపాడు మండలాల్లో పని చేయుటకు విలేకరులు కావలెను.

ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999